సాక్షి
సిద్దిపేట
ఆదివారం । 3 । ఆగస్టు । 2025



చిన్నకోడూరులో తపస్వీ ఫౌండేషన్ సభ్యులు

ఈ స్నేహం .. సమాజ హితం

చిన్నకోడూరు(సిద్దిపేట): పాఠశాల విద్య ముగిసినా.. చెరిగిపోని స్నేహం వారిది. ఐకమత్యంగా ఉంటూ సమాజానికి హితోధిక సాయం చేయాలనే కాంక్ష ఆ స్నేహితులది. బడిబాట నుంచి మొదలైన బాల్య మిత్రుల పయనం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. చిన్నకోడూరు ఉన్నత పాఠశాలలో 1990–91లో పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులంతా ఒక్కటయ్యారు. 2016లో వీరంతా కలిసి తపస్వీ ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. చదివిన పాఠశాలకు రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు ఆర్థిక సాయం, ఉచిత వైద్య శిబిరాలు, తోటి స్నేహితులకు కష్టకాలంలో ఆర్థిక సాయం అందిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

కల్మషం లేనిది.. కష్టాల్లో తోడుగా నిలిచేది



నిజమైన మిత్రులు.. ఇద్దరి కంటే ఎక్కువ ఉన్న వారే అధికం

- కన్నవారి తర్వాతే మిత్రుడు..
- ప్రస్తుత స్నేహ బంధాలు కలుషితం అవుతున్నాయి
- ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా సాక్షి సర్వే
- ఆసక్తి కరమైన అంశాలు వెలుగులోకి..

స్నేహానికి కన్న మిన్న.. లోకాన లేదురా.. అనేది ఒకప్పటి సినిమా పాట. ఇది నిజమేనంటున్నారు ఇప్పటి యువత, విద్యార్థులు, ఉద్యోగులు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' బృందం ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రత్యేక సర్వే నిర్వహించింది. మొత్తం వంద మందితో ఈ సర్వే చేసింది. యువత, విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న వారు, వృత్తి నిపుణులు.. వివిధ వర్గాలకు చెందిన వారి ఒపీనియన్‌లను సేకరించింది. తమ అభిప్రాయలు వెలుబుచ్చిన వారిలో సగం మంది మహిళలు ఉన్నారు. ఈ సర్వే ఆసక్తికరమైన అంశాలు వెలుగు చూశాయి. కల్మషం లేనిదే నిజమైన స్నేహమని ఎక్కువ మంది తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా, నిజమైన స్నేహంలో స్వార్థానికి తావులేదని చెప్పారు. అవసరాలు తీర్చేదే స్నేహమని తక్కువ మంది తన అభిప్రాయాన్ని వెలుబుచ్చారు.

స్నేహం కలుషితమవుతోంది..


ప్రస్తుత రోజుల్లో ఫ్రెండ్ షిప్ కలుషితమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వంద మందిలో 57 మంది ఇదే అభిప్రాయాన్ని చెప్పారు. ఎలాంటి కలుషిత కాలేదని 47 శాతం మంది చెప్పారు. ప్రస్తుత రోజుల్లో స్నేహితులు ఎంతో మంది ఉంటారు. కానీ నిజమైన స్నేహితులు పరిమితంగానే ఉంటారు. మీకు నిజమైన స్నేహితులు ఎంత మంది ఉన్నారనే ప్రశ్నకు ఇద్దరి కంటే ఎక్కువ మంది నిజమైన స్నేహితులు ఉన్నారని చెప్పిన వారే అధికంగా ఉన్నారు. ఇద్దరు కంటే ఎక్కువ మంది స్నేహితులున్నారని 61 మంది చెప్పగా, ఒక్కరే నిజమైన స్నేహితుడు ఉన్నాడని 39 మంది అన్నారు.

మొదటగా కన్నవారే..

కన్న వారి తర్వాతే మిత్రుడికి స్థానమని ఎక్కువ మంది చెప్పారు. 67 శాతం మంది ఇదే అభిప్రాయాన్ని తెలిపారు. 27 శాతం మంది ఫ్రెండ్ తర్వాతే అమ్మానాన్న అని చెప్పిన వారు కూడా ఉన్నారు. నాన్న, అమ్మ, ఫ్రెండ్ అని చెప్పిన వారు 16 మంది ఉన్నారు.

– సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి,
సంగారెడ్డి జోన్/మెదక్ జోన్/సిద్దిపేట

ఉమ్మడి జిల్లాలో సర్వే వివరాలు..



మన కోసం నిలబడే వాళ్లే..



సంగారెడ్డి టౌన్: స్నేహితుల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు. మనకోసం నిలబడే వాళ్లే నిజమైన స్నేహితులు. కష్టాలు, బాధలు, సంతోషాలను పంచుకుంటూ అందరితో కలిసిపోతూ ఉండాలి. నా చిన్న నాటి నుంచి ముగ్గురు స్నేహితులం. వారు వృత్తిరీత్యా ఇతర దేశాలో స్థిర పడినప్పటికీ సమయం దొరికినప్పుడు కలుస్తూ ఉంటాం. ప్రతి ఒక్కరూ అందరితో కలిసి ఉండాలి. 'నేను ఉన్నాను' అనే ధైర్యం ఇవ్వాలి. సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ విజ్ఞాన పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి.

– సౌజన్య,
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

ఆనాటి స్మృతులు మధురం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్నేహితులతో కలిసి మట్టిలో ఆడిన ఆటలు.. చెట్టు కొమ్మల్లో దాగిన రోజులు నేటికీ గుర్తుకువస్తే ఎంతో సంతోషంగా ఉంటోంది. మళ్లీ ఆరోజులు వస్తే బాగుండు అనిపిస్తుంది. నాడు ఎక్కడికి వెళ్లినా ఒక జట్టుగా వెళ్లేవాళ్లం. ఒకరింటికి మరొకరం వెళ్తూ సందడి చేసే వాళ్లం. వినాయక చవితి, దసరా, దీపావళి, బోనాలు, బతుకమ్మ, హోలీ పండుగలను మిత్రులతో సంతోషంగా జరుపుకొనేది. చాలా మంది మిత్రులు నేడు ఉపాధ్యాయ వృత్తితో పాటు ఇతర వృత్తుల్లో ఉన్నారు. ఏ హోదాలో ఉన్నా కలుసుకున్నపుడు అనుభూతి ఏర్పడుతోంది.

– శ్రీనివాస్‌రెడ్డి,
సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి

బాల్య స్నేహితుడికి బాసట



గోపాల్ కుటుంబానికి
బాసటగా నిలిచిన స్నేహితులు

శివ్వంపేట(నర్సాపూర్): బాల్య స్నేహితుడు అనారోగ్యంతో మృతిచెందగా తోటి స్నేహితులు మేమున్నామంటూ బాధిత కుటుంబానికి బాసటగా నిలిచారు. శివ్వంపేటకు చెందిన శేరిపల్లి గోపాల్ అనారోగ్యంతో ఆరేళ్ల క్రితం మృతిచెందాడు. ఇతనికి భార్య ఇద్దరు కుతూళ్లు ఉన్నారు. పేద కుటుంబానికి చెందిన గోపాల్.. వర్గల్‌లోని నవోదయ విద్యాలయంలో 1992–93లో పదో తరగతి పూర్తి చేశాడు. అప్పటి నవోదయ స్నేహితులు గోపాల్ కుటుంబాన్ని ఆదుకున్నారు. స్నేహితులందరూ రూ.3 లక్షలు పోగుచేసి గోపాల్ కుమార్తెలు చందన, అక్షయ పేరిట బ్యాంకులో డిపాజిట్ చేశారు.







- చెరగని చెలిమి.. చెదరని ఆత్మీయం
- వీడదీయలేనిది స్నేహబంధం

నేడు ఫ్రెండ్ షిప్ డే

ఓ నేస్తమా..

సమస్తం నీవే మిత్రమా...

హ్యాపీ ఫ్రెండ్‌షిప్ డే.. అనగానే ఏదో తెలియని అనుభూతి.. ఎదలోతుల్లోని జ్ఞాపకాలు ఒక్కసారిగా ఉబికివస్తాయి.. మరెన్నో మధుర స్మృతులు కళ్లముందు కదలాడుతాయి. అదొక అద్భుత స్నేహలోకం కనిపిస్తుంది.. స్నేహం అవధులు లేనిది.. అంతస్తులు చూడనిది.. వయసు లెక్కచేయనిది.. ఇష్టాలను పంచుకునేది.. కష్టాల్లో తోడుగా నిలిచేది.. ఇలా ఒకటేమిటి.. ఆ బంధాన్ని తెలిపేందుకు భావాలు ఎన్నో.. ఇలా స్నేహం గురించి ఎన్ని చెప్పినా.. అందుకే అంటారు స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతమని. నేటి ఆధునిక సాంకేతిక యుగంలో సామాజిక మాధ్యమాల కారణంగా ఎప్పుడో చిన్ననాటి స్నేహితులు కూడా దగ్గరవుతున్నారు. అలాంటి కోవలోకే ఉమ్మడి జిల్లాలోనూ కొందరు ఉన్నత స్థాయిలో ఉన్నా స్నేహ బంధాన్ని కొనసాగిస్తున్నారు. అంతేకాదు సమాజహితానికి తోడ్పడుతున్నారు. సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. మరోవైపు ఓ కిడ్నాప్ ఘటన ముగ్గురిని ప్రాణస్నేహితులను చేయడం విచిత్రం. ఇలా ఎన్నో తీయనైన, మధురమైన స్నేహాలపై నేడు ఫ్రెండ్ షిప్ డే సందర్భంగా మచ్చుకు కొన్ని ప్రత్యేక కథనాలు..



ఆప్తులున్నవారే అసలైన అదృష్టవంతులు



మెదక్ మున్సిపాలిటీ: వ్యక్తి ఏ స్థాయిలో ఉన్నా.. ఎన్ని ఆస్తులున్నా.. ఆప్తులను సంపాదించుకున్న వారే అదృష్టవంతులు. ఎవరి సమక్షంలో మన బాధలు సగం అవుతాయో.. ఎవరి కారణంగా మన ఆనందం రెట్టింపు అవుతుందో వారే అసలైన ఆప్త మిత్రులు. మానవ బంధాలన్నీ ఆర్థిక సంబంధాలతో ముడిపడుతున్న ఈ ఆధునిక యుగంలో స్వచ్ఛమైన స్నేహం కోసం తాపత్రయపడే వాళ్లెందరో ఉన్నారు. నేను డ్యూటీలో ఎంత బిజీగా ఉన్నా.. రోజూ స్నేహితులతో పది నిమిషాలు మాట్లాడతా. చిన్నప్పుడు కలిసి చదువుకున్న స్నేహితులతో ఇప్పటికీ కలుస్తాను. వారితో మాట్లాడి, ఊరు విషయాలు, కుటుంబ విషయాలు, ఇతర విషయాల గురించి చర్చించుకుంటాం. స్నేహితులతో కలిసి మాట్లాడటం వల్ల ఎంతో రిలీఫ్ ఉంటుంది.

– డీవీ శ్రీనివాసరావు,
ఎస్పీ, మెదక్ జిల్లా



'బంధీ'తో స్నేహ బంధం

ప్రాణస్నేహితులను చేసిన కిడ్నాప్ ఘటన..



మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, రామన్న, సికిందర్ కలిసి ఉన్న చిత్రం

దుబ్బాక: ఓ కిడ్నాప్ ఘటన ముగ్గురిని ప్రాణస్నేహితులను చేసింది. 34 ఏళ్ల క్రితం కిడ్నాప్ ఘటన జరిగినా ఆ ముగ్గురి మధ్య ప్రేమ నేటికీ చెక్కుచెదరలేదు. ఆ నాటి సంఘటన ఒక్కసారి గుర్తు చేసుకుందాం.. 1991 ప్రాంతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా సీఎంగా నెదురుమల్లి జనార్దన్‌రెడ్డి ఉన్నారు. పీపుల్స్‌వార్ ప్రాబల్యం అధికంగా ఉన్న ఆ రోజుల్లో ప్రస్తుత మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. ఓ రోజు ఫారూఖ్ తన చిన్ననాటి స్నేహితుడు సికిందర్ తో కలిసి స్కూటర్‌పై దుబ్బాకకు వస్తున్న క్రమంలో అప్పటి దుబ్బాక పీపుల్స్ వార్ దళం కమాండర్‌గా ఉన్న రామన్న ఫారూఖ్, సికిందర్‌లను కిడ్నాప్ చేయడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. వరంగల్ జిల్లాకు చెందిన రామన్న ఉద్యమ రీత్యా దుబ్బాక ప్రాంతంలో పనిచేస్తుండగా అప్పటి వరకు వీరికి ఎలాంటి పరిచయం లేదు. కిడ్నాప్ అయినప్పుడే వీరికి రామన్న పరిచయం అయ్యాడు. ఆతర్వాత రామన్న పీపుల్స్ వార్ పార్టీని వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చాక మాజీ ఎమ్మెల్సీ ఫారూక్, సికిందర్, రామన్నలు ప్రాణస్నేహితులయ్యారు. రామన్న ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండడంతో అ కుటుంబానికి ఫారూఖ్ హుస్సేన్ చాలా సార్లు అండగా నిలిచారు. వీరు ముగ్గురు తరుచూ కలుస్తూ తమ కష్ట సుఖాలు పంచుకుంటూ ఆదర్శ స్నేహితులుగా నిలిచారు. ఏదేమైనా బంధీలో పరిచయంలో ఈ ముగ్గురిని ప్రాణస్నేహితులను చేయడం విశేషం.

క్లాస్‌మేట్స్ క్లబ్ పేరిట సేవలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1981 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కలిసి క్లాస్‌మేట్స్ క్లబ్ పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. క్లాస్‌మేట్స్ క్లబ్ అధ్యక్షుడు జయప్రకాశ్ మాట్లాడుతూ నాగర్ కర్నూల్‌కు చెందిన ఉపాధ్యాయులు క్లాస్‌మేట్స్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని మా పూర్వ విద్యార్థులందరం కలిసి క్లాస్‌మేట్స్ క్లబ్ పేరిట సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. స్నేహితులు తమకు తోచిన విధంగా ఆర్థిక సహాయం చేస్తున్నారు. తాము చదువుకున్న పాఠశాలతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 2023 నుంచి నోట్ పుస్తకాలు అందిస్తున్నాం. అలాగే పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నాం. స్నేహితులందరం కలిసి సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉంది.



క్లాస్‌మేట్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం





పాఠశాలలో ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకొంటున్న విద్యార్థులు

స్నేహ బంధం..

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లో ముందస్తు ఫ్రెండ్‌షిప్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లను కట్టుకొన్నారు. ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

క్లుప్తంగా

సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చు


పుస్తకాలు అందజేస్తున్న శ్రీనివాస్ రెడ్డి

హుస్నాబాద్: విద్యార్థుల్లో చదవాలనే సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థుల కోసం శంషాబాద్ డిప్యూటీ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అయిలేని శ్రీనివాస్ రెడ్డి శనివారం గ్రంథాలయానికి పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో నెగ్గి ఉద్యోగాలు సాధించిన వారు తమ వద్ద ఉన్న పుస్తకాలను గ్రంథాలయానికి ఇస్తే పేద విద్యార్థులకు ఉపయోగపడతాయని తెలిపారు. చదువు ఉంటే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ ఎంపీపీ వెంకట్, సత్యనారాయణ, అశోక్, రిటైర్డు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రంగనాయక సాగర్‌పై హెచ్చరిక బోర్డు


ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

సాక్షి ఎఫెక్ట్..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్ శివారులోని రంగనాయక సాగర్ రిజర్వాయర్‌పై నిఘా లేకపోవడంతో పర్యాటకులు ప్రమాదాలకు గురవుతున్నారని రంగనాయకా.. రక్షణ ఏది? అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన పోలీసులు శనివారం రిజర్వాయర్‌పై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పర్యాటకులు ఈ ప్రాంతాల్లోకి వెళ్లొద్దని సూచనలు చేశారు. ఎస్‌ఐ సైఫ్ అలీ మాట్లాడుతూ.. ప్రతిరోజు సాయంత్రం సాగర్ కట్టపై పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. ఆకతాయిలపై నిఘా ఏర్పాటు చేసి వారిపై చర్యలు తీసుకుంటామని, కట్టపై బైక్ రైడింగ్ నిషేధించామని పేర్కొన్నారు.

'భగీరథ'మరమ్మతులు ప్రారంభం


భగీరథ పైపులైన్ మరమ్మతు పనులు

వర్గల్(గజ్వేల్): 'భగీరథ లీకైంది..తోట చెరువైంది' శీర్షికతో శనివారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన మిషన్ భగీరథ అధికారులు మండలంలోని గౌరారం వద్ద లీకేజీకి గురైన పైపులైన్ వద్ద మరమ్మతు పనులు ప్రారంభించారు. జేసీబీ యంత్రంతో తవ్వకాలు జరిపి లీకేజీని గుర్తించారు. చీకటిపడే వరకు పనులు కొనసాగించారు. ఆదివారం మరమ్మతులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు. కాగా కూరగాయల తోట, పొలాల్లో నీరు బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో అలాగే నిలిచిపోయింది.

గడువు ముగిసిన మందులు ఉండొద్దు

డీఎంహెచ్‌ఓ డాక్టర్ ధనరాజ్


సిబ్బందితో మాట్లాడుతున్న ధనరాజ్

సిద్దిపేటకమాన్: గడువు ముగిసిన మందులు నిల్వ ఉండకుండా చూసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ధనరాజ్ తెలిపారు. సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలోని టీ హబ్‌ను, సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను డీఎంహెచ్‌ఓ శనివారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆరోగ్య కేంద్రాల నుంచి వచ్చిన బ్లడ్ శాంపిల్స్‌ను పరీక్షలు నిర్వహించి ఫలితాలను అదే రోజు పంపించాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రేవతి, టీహబ్ మేనేజర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

లక్ష్యం.. 100 అడుగుల దూరం

ప్రహసనంగా వంద రోజుల ప్రణాళిక

- సిబ్బంది కొరతతో ఇబ్బందులు
- జిల్లాలోని మున్సిపాలిటీల పరిస్థితిపై పరిశీలన


గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో మొక్కలు నాటుతున్న అధికారులు

గజ్వేల్: మున్సిపాలిటీలను సమగ్ర పట్టణాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా 'వంద రోజుల ప్రణాళిక' కార్యక్రమం కొనసాగుతున్నది. తాజాగా శనివారం నాటికి ఈ కార్యక్రమం 62వ రోజుకు చేరుకుంది. పారిశుద్ధ్యం మొదలుకొని ఆస్తి పన్నుల అసెస్‌మెంట్, భువన్‌సర్వే, ట్రేడ్‌లైసెన్స్‌లు తదితర అంశాలపై కార్యాచరణ కొనసాగుతున్నది. మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న ఈ కార్యక్రమాలను మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు మదింపు చేస్తున్నారు. కానీ సిబ్బంది కొరత, ఇతర సమస్యలు కార్యక్రమం లక్ష్యానికి అవరోధంగా మారుతున్నాయి.

జిల్లాలో సిద్దిపేట మినహా గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక పట్టణాలు 2012లో మేజర్ పంచాయతీల నుంచి మున్సిపాలిటీలుగా చేశారు. చేర్యాలను ఆరేళ్లక్రితం మున్సిపాలిటీగా మార్చారు. అప్‌గ్రేడ్ అయిన తర్వాత ఆయా పట్టణాల్లో మెరుగైన పాలన అందుతుందని ప్రజలు భావించారు. కానీ పరిస్థితిలో ఏ మార్పు లేదు. పారిశుద్ధ్యం మొదలుకొని అన్ని అంశాల్లోనూ సమస్యలున్నాయి. సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు సక్రమంగా సాగటం లేదు. అంతేకాదు.. ఇంటి పన్నుల అసెస్‌మెంట్, ఇళ్ల అనుమతులు, ఇంటి నంబర్ల కేటాయింపు, నల్లాల ఆన్‌లైన్, ట్రేడ్ లైసెన్స్‌లు, భువన్ సర్వే తదితర అంశాల్లో మెరుగైన సేవలు అందటం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో '100 రోజుల ప్రణాళిక' కార్యక్రమం కొనసాగుతున్నది.

సెప్టెంబర్ 10 వరకు..

తాజాగా శనివారం నాటికి వంద రోజుల ప్రణాళిక కార్యాచరణ 62వ రోజుకు చేరుకున్నది. సెప్టెంబర్ 10వరకు కొనసాగనున్నది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయిలో మున్సిపల్ ఉన్నతాధికారులు రోజువారీగా విశ్లేషిస్తున్నారు. రోజువారీగా చేపట్టే అంశాలకు సంబంధించి ఆయా మున్సిపాలిటీల పనితీరును మదింపు చేస్తున్నారు. వెనుకబడుతున్న వాటికి తగు లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు. ఈ క్రమంలోనే జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో అనుకున్న స్థాయిలో ఈ కార్యక్రమం ఫలితాలు కనిపించడం లేదు. సాధారణ స్థాయిలోనే కార్యాచరణ కొనసాగుతున్నది. సిబ్బంది కొరత, ఇతర సమస్యల వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని తెలుస్తోంది.


ట్రేడ్ లైసెన్స్‌ల జారీకి ఓ దుకాణంలో కొలతలు వేస్తున్న అధికారులు

పారిశుద్ధ్యం తీరు అధ్వానమే..

సిద్దిపేట మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణలో కొన్ని మార్పులు వచ్చాయి. ఇక గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో నిత్యం 18మెట్రిక్ టన్నులపైగా చెత్త ఉత్పత్తి అవుతున్నది. ప్రస్తుతం ఈ మున్సిపాలిటీ పరిధిలో డంపింగ్ యార్డు అందుబాటులోకి వచ్చి, చెత్త సేకరణకు కొంతమేర వాహనాలు, సిబ్బంది ఉన్నా... సేకరణలో శాస్త్రీయత లోపించింది. కంపోస్టు తయారీ, పొడి చెత్తను ఆదాయంగా మార్చే ప్రక్రియ సక్రమంగా సాగటం లేదు. హుస్నాబాద్ మున్సిపాలిటీలో దాదాపు 30వేలకుపైగా జనాభా, 6800కుపైగా ఇండ్లు ఉన్నాయి. రహదారుల నుంచి, ఇండ్ల నుంచి సేకరించిన చెత్తను ట్రాక్టర్లల్లో డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ప్రతి రోజు దాదాపు 11మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. ఇక్కడ కూడా పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో చెత్త తరలింపు సమస్యగానే పరిణమించింది. దుబ్బాకలో 28వేల జనాభా ఉండగా... 7వేల ఇండ్లు ఉన్నాయి. ఇక్కడ నిత్యం 4.25మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. పారిశుద్ధ్య నిర్వహణ ఇక్కడ కూడా ఘోరంగా ఉంది. చేర్యాల మున్సిపాలిటీలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది.

మెరుగైన సేవలకు కృషి



గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నాం. దీని ద్వారా మెరుగైన పాలనకు బాటలు వేస్తున్నాం. మున్సిపాలిటీల అభివృద్ధిలో ప్రజల భాగస్వామం కూడా కీలకమే. ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం. – బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్

ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచండి

- సాగు విస్తీర్ణం మేరకే ఎరువులు
- కలెక్టర్ హైమావతి


ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

కొమురవెల్లి(సిద్దిపేట): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ హైమావతి లబ్ధిదారులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఎంపీడీవో శ్రీనివాసవర్మతో కలిసి నూతనంగా నిర్మాణం చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల పనులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశు వైద్యశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం , ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గొర్రెలకు ఇచ్చే బ్లూటాంగ్ వ్యాక్సిన్ ప్రకియను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ సమయంలో మెడికల్ ఆఫీసర్ సెలవులో ఉన్నాడని డ్యూటీ నర్సు తెలుపడంతో జిల్లా వైద్యాధికారికి ఫోన్‌చేసి సెలవు మంజూరుపై ఆరా తీశారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పప్పు ఉడకకపోవడంతో వంట మనుషులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలోని సేల్స్ రిజిస్టర్‌ను పరిశీలించి రైతులకు విస్తీర్ణం ప్రకారమే ఎరువులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో రమేశ్, పంచాయతీ కార్యదర్శి హరీశ్, అధికారులు పాల్గొన్నారు.

జిల్లాను ఆదర్శంగా నిలపాలి

సిద్దిపేటరూరల్: జిల్లాలోని రైతులను ఆర్థికంగా బలోపేతం చేసి ఆదర్శంగా తీర్చిదిద్దే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ఉద్యాన, వ్యవసాయ, ఆయిల్ ఫెడ్ శాఖల అధికారులతో ఆయిల్ పామ్ సాగు, ఫార్మర్ రిజిస్ట్రీ అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగుపై ఉత్సాహం చూపుతున్న రైతులను ప్రోత్సహించడంతోపాటు మండల వ్యవసాయ అధికారులకు నిర్దేశించిన మేర సాగు జరిగేలా ప్రయత్నం చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, ఉద్యానవనశాఖ అధికారి సువర్ణ, వ్యవసాయ శాఖ అధికారి స్వరూపరాణి, టీజీ ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం ఇవ్వాలి

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్


గురుకులంలో కూరగాయలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గురుకుల విద్యార్థులకు నాణ్యమైన, బలవర్ధకమైన ఆహారం అందించాలని, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మహాత్మాజ్యోతిపూలే బీసీ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, స్టోర్ రూమ్ గల సరుకులను, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులకు కచ్చితంగా మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలని, వంటగదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. అనంతరం కేసీఆర్ నగర్ డబుల్ బెడ్ రూం కాలనీలోని గ్రంథాలయంను పరిశీలించారు. పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. ఇండ్ల నిర్మాణ వేగంగా జరిగేలా పర్యవేక్షించాలని మున్సిపల్, హౌసింగ్ అధికారులను ఆదేశించారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

ఎమ్మెల్యే హరీశ్ రావు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్ రావు

సిద్దిపేటజోన్: యోగాతో మానసిక ఒత్తిడిని దూరం అవుతుందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పేర్కొన్నారు. శనివారం స్థానిక విపంచి ఆడిటోరియంలో అస్మితా యోగాసనా సిటీ లీగ్ – 2025 మహిళల యోగా పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కరోనా ప్రజల జీవితాల్లో అనేక మార్పులు తెచ్చిందని, కరోనా తర్వాత యోగా ప్రాముఖ్యత పెరిగిపోయిందన్నారు. లక్షలు ఖర్చు పెట్టి ఆస్పత్రుల్లో నయం చేసుకునే కంటే ముందుగానే స్వీయ రక్షణ ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ యోగా, వాకింగ్ లాంటి తప్పనిసరి చేయాలన్నారు. యువతులు, బాలికలు వేసిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంజుల, వైస్ చైర్మన్ కనకరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు వేణుగోపాల్‌రెడ్డి, సాయిరాం, డాక్టర్ అరవింద్, నిర్వాహకులు సతీశ్, సంధ్య, అంజయ్య, అశోక్ శ్రీనివాస్ రెడ్డి, విక్రమ్ రెడ్డి, విజయ పాల్గొన్నారు.

మల్లన్నసాగర్ పైపులైన్ పూర్తవడంతో సంబరాలు

కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటాపోటీగా జలాభిషేకాలు


సీఎం చిత్రపటానికి జలాభిషేకం చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, ఆ పార్టీ నాయకులు


ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి జలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గజ్వేల్: స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్న వేళ...గజ్వేల్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటాపోటీ కార్యక్రమాలతో ముందుకుసాగుతున్నాయి. మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి గజ్వేల్‌కు రూ.210కోట్లతో చేపట్టిన ప్రత్యేక మిషన్ భగీరథ పైపులైన్ పనులు పూర్తయి మంచినీటి సరఫరా ప్రారంభమైంది. శనివారం రెండు పార్టీలు జలాభిషేకాలు నిర్వహించాయి. డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు గజ్వేల్ మండలం కోమటిబండ గుట్టపై ఉన్న మిషన్ భగీరథ హెడ్‌వర్క్స్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ సీఎం చొరవ తీసుకొని రూ.210కోట్లు మంజూరు చేయడం వల్లే గజ్వేల్‌కు మల్లన్నసాగర్ నుంచి మిషన్ భగీరథ ప్రత్యేక పైపులైన్ వచ్చిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కృషివల్లే గజ్వేల్‌కు మిషన్ భగీరథ నీరు వచ్చిందని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ గజ్వేల్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకులతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి జలాభిషేకం చేశారు.

అసభ్యంగా మాట్లాడటంతోనే హత్య

- ఐకేపీ ఉద్యోగి కేసులో నలుగురు నిందితులు అరెస్టు
- వివరాలు వెల్లడించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్‌ఐ విజయ్‌కుమార్

ములుగు(గజ్వేల్): అదృశ్యమై హత్యకు గురైన ఐకేపీ ఉద్యోగి కేసులో పోలీసులు నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. శనివారం ములుగు పోలీస్ స్టేషన్‌లో గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్‌ఐ విజయ్‌కుమార్ కేసు వివరాలు వెల్లడించారు. ములుగుకు చెందిన ఐకేపీ ఉద్యోగి తిగుళ్ల నెహ్రూ(35) గతనెల 28న అదృశ్యమైనట్టు బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే.. నెహ్రూ, మజీద్‌పల్లి గ్రామానికి చెందిన గామిలిపురం మహేశ్ కలిసి చిట్‌ఫండ్ లావాదేవీలు నిర్వహించేవారు. మహేశ్‌కు కొండపాక సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న నిషారాణితో వివాహేతర సంబంధం ఉంది. ఆమెకు చెందిన బంగారాన్ని వర్గల్‌లోని ఓ మైక్రో ఫైనాన్స్‌లో పెట్టి ఆ డబ్బును చిట్‌ఫండ్‌కు వినియోగించనున్నట్లు మహేశ్ జూలై 28న ఆమెతో చెప్పాడు. నిషారాణి హామీదారుగా నెహ్రూను తీసుకురావాలని చెప్పింది. దీంతో మహేశ్ ములుగు నుంచి నెహ్రూను కారులో తీసుకుని నిషారాణి ఇంటికి వెళ్లాడు. ఇదే సమయంలో నిషారాణిపై నెహ్రూ అసభ్యకర వ్యాఖ్యలు చేయడంతో మహేశ్ అతడిపై దాడిచేశాడు. అపస్మారక స్థితిలోకెళ్లిన నెహ్రూను ఒక వైర్‌తో గొంతునులిమి హత్య చేశాడు. ఆ మృతదేహాన్ని నిషారాణితో పాటు ఆమె తండ్రి నారదాసు కొమురయ్య సాయంతో కారులో తీసుకువెళ్లి గాగిల్లాపూర్ సమీపంలోని ఓ చెరువులో పడేశారు. అనంతరం మహేశ్ రూ.15 వేల చిట్‌ఫండ్ డబ్బును నెహ్రూ భార్యకు అందించి అతను బాగానే ఉన్నాడని నమ్మించే ప్రయత్నం చేశాడు. నెహ్రూ ఫోన్‌ను ములుగు కొండపోచమ్మ కాలువలో పడేశాడు. విచారణలో భాగంగా ప్రధాన నిందితుడు గామిలిపురం మహేశ్, అతడికి సహకరించిన నిషారాణి, ఉబ్బని వినయ్, నారదాసు కొమురయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రెండు కార్లు, నాలుగు సెల్ ఫోన్లు, టీవీఎస్ ఎక్సెల్ వాహనం, మైక్రో ఫైనాన్స్‌లోని బంగారం రుణానికి సంబంధించిన రశీదును స్వాధీనం చేసుకున్నారు.

నకిలీ ఎరువుల కలకలం

- ఇష్టారాజ్యంగా విక్రయాలు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళన చెందుతున్న రైతులు



రైతులు చల్లిన నకిలీ ఎరువు బస్తాలు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని ఎరువుల దుకాణాల్లో నకిలీ ఎరువులు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. బోరుబావుల కింద కొద్దో గొప్పో సాగు చేస్తున్న రైతులకు ఎరువుల దుకాణదారులు నకిలీ ఎరువులను అంటగడుతున్నారు. మనుగడలో లేని కంపెనీ పేర్లతో ఉన్న ఎరువుల బస్తాలు, దంటు గుళికలు , పురుగుమందులు విక్రయిస్తూ రైతులకు ఆర్థికంగా నష్టం చేకూరుస్తున్నారు. ఇంత జరిగినా వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం శాపంగా మారింది. గ్రోమోర్ 20.20.0.13, గోదావరి డీఏపీ , 14.35.14, 19.19.19, 17.17.17 ఇట్లాంటి పేరున్న కంపెనీ ఎరువులు అమ్మితే దుకాణదారులకు తక్కువ లాభాలొస్తాయి. కానీ, పంటలకు, రైతులకు మేలు జరుగుతుంది. ఇందుకు భిన్నంగా మండలంలో ఎక్కడ కనబడని కంపెనీ పేర్లతో ఉన్న ఎరువులు అంటగడుతున్నారు. కారణం వీటిపై ఎక్కువ లాభాలు వస్తుండటంతో వాటినే విక్రయిస్తున్నారు. ఈ నాసిరకం ఎరువులు వాడిన అన్నదాతలు చేను ఎదకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నకిలీ ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈ ఎరువును ఎప్పుడు చూడలేదు



వరినాటులో ఎరువు చల్లేందుకు డీఏపీ బస్తా కోసం ఎరువుల దుకాణానికి వెళితే అది అందుబాటులో లేదని భూమిలాబ్ 19.19.19 అనే ఎరువును అంటగట్టాడు. దానిని పొలంలో చల్లితే పని చేయలేదు. దీనిపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియడం లేదు. అధికారులు స్పందించి నకిలీ ఎరువుల బెడదను అరికట్టాలి.
-కిష్టారెడ్డి, రైతు, మర్రిముచ్చాల

నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు

మండలంలో నకిలీ ఎరువులు విక్రయిస్తున్నట్లు మా దృష్టికి ఇంత వరకు రాలేదు. మా పరిశీలనలో తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.
-వెంకట్రావమ్మ, మండల వ్యవసాయ అధికారి

డ్రోన్ పేరుతో సైబర్ మోసం

రూ.2.39 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

దుబ్బాకటౌన్: డ్రోన్ అమ్మకానికి ఉందని అమాయకుడిని నమ్మించి సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేశారు. ఈ ఘటన రాయపోల్ మండలం సయ్యద్ నగర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన అలీ బీబీ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. భర్త అలీ హుస్సేన్ దుబాయిలో డ్రైవర్‌గా పనిచేస్తూ డబ్బులు భార్య ఖాతాలో జమ చేస్తున్నాడు. ఈ బ్యాంక్ ఖాతాకు కొడుకు అజ్మద్దీన్ ఫోన్ నంబర్ లింక్ అయ్యి ఉంది. ఫోన్ పే, గూగుల్ పే ద్వారా ఇంటి అవసరాలకు డబ్బులు వాడుకుంటున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం అజ్మద్దీన్ ఇన్‌స్టాగామ్‌లో వీడియోలు చూస్తుండగా ఓ వీడియోలో డ్రోన్ కెమెరా అమ్మబడును అని కింద ఫోన్ నంబర్ రాసి ఉంది. ఆ నంబర్‌కి ఫోన్ చేసి డ్రోన్ కెమెరా కావాలని అడగడంతో డబ్బులు పంపితే కెమెరా పంపిస్తామని అవతలి వ్యక్తి చెప్పాడు. దీంతో అజ్మద్దీన్ రూ. 50 వేలు పంపాడు. జూలై 31, ఆగస్టు 1న పలుమార్లు ఫోన్ పే ద్వారా మొత్తం రూ.2 లక్షల 39 వేల వరకు పంపించాడు. మోసపోయామని గుర్తించి అజ్మద్దీన్ మామ అఫ్సర్ పోలీసులకు,సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పంచాయతీ కార్యదర్శి బైక్ దహనం

నంగునూరు(సిద్దిపేట): పంచాయతీ కార్యదర్శి బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. ఈ ఘటన శనివారం తిమ్మాయిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామ కార్యదర్శి ఎండీ గౌసొద్దీన్ ఉదయం తన మోటార్ సైకిల్‌ను శ్మశాన వాటిక వద్ద పెట్టి నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్నాడు. ఈక్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై పెట్రోలు పోసి తగలబెట్టారు. దీంతో అందులో ఉన్న పంచాయతీ రికార్డులు కాలిపోవడంతో రైతులు మంటలను ఆర్పివేశారు. పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో అసంతృప్తే కారణమా? లేక మరేదైనా కారణం ఉందా? అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.


ఖాళీ బిందెలతో ఆందోళనకు దిగిన మహిళలు

ఖాళీ బిందెలతో.. మహిళల నిరసన

మిరుదొడ్డిలో నిలిచిన భగీరథ తాగునీటి సరఫరా

మిరుదొడ్డి(దుబ్బాక): మూడు రోజులుగా మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని పలు వార్డుల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని స్థానిక మహిళలు శనివారం ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. తాగునీటిని సరఫరా చేయడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. చాలా రోజులుగా అరకొరగా నీరు సరఫరా అవుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని అసహనం వ్యక్తం చేశారు. మూడు రోజులుగా తాగునీటి సరఫరా లేకపోవడంతో నీటి కోసం నానా తంటాలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

గ్రూపులుంటేనే మజా

కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్


మాట్లాడుతున్న మహేశ్ కుమార్ గౌడ్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి /వట్‌పల్లి : రాజకీయ పార్టీల్లో ఆధిపత్య పోరు, గ్రూపులు లేకుంటే ఆ పార్టీ అభివృద్ధి చెందదని, గ్రూపులు ఉంటేనే ఉత్సాహం ఉంటుందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. గ్రూపు తగాదాలు లక్ష్మణ రేఖ దాటవద్దని సూచించారు. అన్ని నియోజకవర్గాల్లో గ్రూపులు ఉంటాయని, ఎన్నికలు వస్తే అన్ని గ్రూపులు ఒక్కటై పోరాడి విజయం సాధించాలని హితవు పలికారు. తాము మాత్రం అన్ని గ్రూపులకు సమాన ప్రాధాన్యమిస్తామని స్పష్టం చేశారు. జనహిత పాదయాత్రలో భాగంగా కాంగ్రెస్ నాయకులు శనివారం జోగిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన శ్రమదాన కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం సంగుపేటలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని, చాలా ఏళ్లుగా పార్టీలో పనిచేస్తున్న వారికే ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. పార్టీకి కొత్త నీరు కూడా అవసరమని అందుకే 15% కొత్తవారిని కూడా తీసుకుంటున్నామని, పాత, కొత్తలతో ముందుకు సాగుతున్నామన్నారు.

సర్వేల ఆధారంగానే స్థానిక టికెట్లు

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచే అభ్యర్థులకే టికెట్లు ఇస్తామని, సర్వేల ఆధారంగానే కేటాయింపు ఉంటుందని మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ సురేశ్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవ రెడ్డి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, పార్టీ నాయకులు చంద్రశేఖర్, రాజిరెడ్డి పాల్గొన్నారు.